ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
శనివారం 8 జూన్ 2024





కౌంటింగ్ కేంద్రం వద్ద విజయానందంలో తీన్మార్ మల్లన్న

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

- అధికారిక ప్రకటన కోసం అర్ధరాత్రి వరకు ఎదురుచూపు
- అన్ని రౌండ్లలోనూ తీన్మార్ మల్లన్నదే ఆధిక్యత
- చివరి వరకు ఉత్కంఠగా సాగిన లెక్కింపు
- మూడో ప్రయత్నంలో దక్కిన విజయం

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న విజయం దాదాపు ఖాయమైంది. కానీ, ఎన్నికల సంఘం అనుమతితో ఆయన గెలుపును ప్రకటించేందుకు అధికారులు శుక్రవారం అర్ధరాత్రి వరకు ఎదురుచూశారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు ఎక్కువ ఓట్లుండడంతో మల్లన్నను విజేతగా ప్రకటించేందుకు ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి లేఖరాశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మూడు రోజుల పాటు సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతీ రౌండ్‌లోనూ మల్లన్న ఆధిక్యతను చాటితే రాకేశ్‌రెడ్డి కూడా సత్తా చాటుతూ వచ్చారు. చివరి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొనడం ఉత్కంఠను రేపింది. ఇక స్వతంత్రుల్లో అశోక్‌కుమార్ మినహా మిగిలిన 48మందికి వచ్చిన ఓట్లను ఎలిమినేషన్‌లో పద్ధతిలో చేయగా.. తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డికి దాదాపు సమానంగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. మొత్తం 57 మంది అభ్యర్థుల్లో రాత్రి పదిగంటలవరకు అధికారికంగా ప్రకటించిన ప్రకారం మొదటి 47 మంది స్వతంత్ర అభ్యర్థుల బ్యాలెట్ల నుంచి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కలుపుకొని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 124899 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,05,524 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 30,461 ఓట్లు వచ్చాయి. ఈ ఎలిమినేషన్ల తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు జడ్సన్, పాలకూరి అశోక్‌కుమార్‌తో పాటు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ కూడా రాత్రి పదిలోపు పూర్తయింది. అప్పటికీ మల్లన్నకే ఆధిక్యత ఉన్నప్పటికీ కోటా ఓటుకు చేరకపోవడంతో ఎన్నికల సంఘం అనుమతి మేరకు ఆయన్ను విజేతగా ప్రకటించే ప్రక్రియను చేపట్టారు. అధికారిక ప్రకటన ఆలస్యమవుతుండడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద నాయకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

అశోక్, ప్రేమేందర్ ఎలిమినేషన్ తర్వాత కూడా ఎవరికీ రాని కోటా ఓటు

మొదటి ప్రాధాన్యతలో 29,697 ఓట్లు సాధించిన కీలక

మిగతా 8వ పేజీలో..

వానాకాలం వరదల రాకకు ముందే మేడిగడ్డ మరమ్మతు పనులను పూర్తిచేసి బ్యారేజీ గేట్లన్నీ తెరిచేలా చూడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని పరిశీలనకు వచ్చిన ఆయన తొలుత సుందిళ్ల, ఆ తర్వాత అన్నారం బ్యారేజీలను పరిశీలించి.. మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడిగడ్డ చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి అంబట్‌పల్లిలోని ఎల్అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. బ్యారేజీలో లోపాల అంశం కేవలం అధికారుల స్థాయిలో మాత్రమే చర్చించారని.. ముఖ్యమంత్రి, మంత్రి స్థాయిలో దీనిపై సమీక్ష జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు బ్యారేజీల వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకే బ్యారేజీలను సందర్శిస్తున్నామన్నారు. అలాగే బ్యారేజీల లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జ్యుడీషియల్ విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కూడా అన్నారం సరస్వతి బ్యారేజీని శుక్రవారం సాయంత్రం సందర్శించారు. 35, 48 పిల్లర్ల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి.. పనులు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

- మహదేవపూర్ రూరల్/ మహదేవపూర్

7



బ్యారేజీ దిగువన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

7

పనుల్లో వేగం పెంచండి

అన్నారం బ్యారేజీ సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

- ఎన్‌డీఎస్ఏ సూచనలు పాటిస్తూ వేగం పెంచాలి
- నిర్మాణ సంస్థల ఖర్చులతోనే టెస్టులు, తాత్కాలిక మరమ్మతులు
- మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ పనితీరుపై అసహనం



మేడిగడ్డ బ్యారేజీ వద్ద పగుళ్లు తేలిన పిల్లర్లను పరిశీలిస్తున్న మంత్రి

వరదలతో ప్రాణనష్టం జరగొద్దు

- ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టండి
- అధికారులకు మంత్రి సీతక్క సూచన



ములుగు, జూన్ 7 : వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని, వరద ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతేడాది వరదల కారణంగా లోతట్టు ప్రాంతాలలోని పలు గ్రామాలు ముంపుకు గురైన విషయాన్ని గుర్తు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువులు, కుంటల కట్టలను పరిశీలించి తక్షణమే మరమ్మతు చేయించాలన్నారు. ఇందుకోసం డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. గోదావరి, జంపన్నవాగు వరదలతో సమీప గ్రామాలు ముంపునకు గురయ్యాయని, ఆ ప్రదేశాలపై నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. కరకట్ట నిర్మాణ పనులు వేగం చేయాలన్నారు. వెంకటాపూర్(రామప్ప) మండలంలోని మారేడుగొండ చెరువు కట్ట నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు.

శుక్రవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0°C | కనిష్ఠం : 23.0°C

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- భూపాలపల్లి లారీలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, జూన్ 7 : లారీ యజమానులు, కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలో ది కాకతీయఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ఎమ్మెల్యే గండ్ర ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ట్రాన్స్‌పోర్టులో భూపాలపల్లి లారీలకు కోల్‌ట్రాన్స్‌పోర్టు వారు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. లేనట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు లారీలతో ప్రారంభమైన లారీల అడ్డా ఈ రోజు 400 లారీలకు ఎదిగిందని, అలాగే ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 1997లో భూపాలపల్లి లారీ అసోసియేషన్‌కు భూమి ఇప్పించింది తన ఆధ్వర్యంలోనేనని గుర్తు చేశారు. అయితే కొందరు ఆభూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. లారీ అసోసియేషన్ భూమిని ఎవరూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు చెప్పి 5.20 ఎకరాల భూమిపై సర్వే చేయిస్తానని, అలాగే రెండు దశల్లో ప్రహరీ నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లారీ అసోసియేషన్‌కు పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. అసోసియేషన్‌లో ఏమైనా అవినీతి ఆరోపణలు వినిపిస్తే ఖండనచేసి దండన చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్‌పై ఆజమాయిషీ చేయనని, సలహాలు, సూచనలు మాత్రమే ఇస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేసి గౌరవాన్ని కాపాడుకోవాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేకల చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబమూర్తి, బాలచందునాయక్, మేకల సంపత్‌యాదవ్, రమేష్, రవి, బొతు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలి

- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, జూన్ 7: జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించి మిషన్ భగీరథ సర్వేను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం ములుగు కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసరావుతో కలిసి మిషన్ భగీరథ సర్వే మొబైల్ అప్లికేషన్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించే ఉద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా మిషన్ భగీరథ సర్వేకు శ్రీకారం చుట్టిందని అనానరు. ఈ సర్వేను జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వేలో సర్వేయర్‌కు కేటాయించిన గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేయాలని, ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా.. లేదా, ఉంటే ఆ కుటుంబానికి సరిపడా నీరు అందుతున్నదా.. లేదా, కనెక్షన్ ఉన్నా కూడా నల్లా పనిచేయకపోతే ఎందుకు పనిచేయడం లేదనే అంశాలను మొబైల్ అప్లికేషన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని, నల్లా కనెక్షన్ తప్పనిసరిగా ఉండేవిధంగా చూడాలన్నారు. నల్లా కనెక్షన్ లేని గృహాలకు త్వరలోనే నల్లా కనెక్షన్ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సుభాష్, డీఈ హజార్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవోలు, ఏఈలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడ్డ చెట్లు.. నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు, తడిసిన వడ్ల బస్తాలు



గొల్లపల్లిలో ఇంటిముందు విరిగిపడ్డ చెట్టు

కాటారం, జూన్ 7 : మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తీవ్రమైన గాలులతో పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. గొల్లపల్లిలో స్వామి అనే వ్యక్తి ఇంటి ముందు పెద్ద చెట్టు వేర్లతో సహా రోడ్డు వైపు విరిగిపడటంతో ప్రమాదం తప్పింది. కాటారం-మంథని ప్రధాన రహదారిపై పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దేవరాంపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో గాలివానకు విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో కాలనీ వాసులకు రాత్రంతా చీకట్లో జాగారం తప్పలేదు. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది రాత్రంతా మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సరిపడా విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో వానాకాలం ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు, వడ్ల బస్తాలు తడిసిపోయాయి.



భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లిలో అలంకారప్రాయంగా ఉన్న రైతు వేదిక

ఏఈవోలు ఎక్కడ?



రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామంలో నిరుపయోగంగా రైతువేదిక



భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి రైతు వేదిక చుట్టూ పెరిగిన గడ్డి

- నామమాత్రంగా విధుల నిర్వహణ
- మండల కేంద్రాలకే పరిమితం
- తెరుచుకోని రైతు వేదికలు.. కానరాని సదస్సులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వైనం
- ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు ఖర్చు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7 : పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఒక్కో వేదికకు రూ.22లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. వాటి నిర్వహణ బాధ్యత వ్యవసాయ శాఖ విస్తరణాధికారులకు(ఏఈవో) అప్పగించింది. ప్రతి రోజూ రైతు వేదికను తెరిచి రైతులకు అందుబాటులో ఏఈవోలు ఉండాలి. కానీ, ఎక్కడా కూడా ఆ పద్ధతి అమలవడం లేదు. కనీసం నెలకోమారు కూడా ఆ వేదిక తెరుచుకోవడం లేదు. పూర్తిగా అలంకార ప్రాయంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అవుతోంది. పట్టించుకునే వారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతోంది. ఈ వేదికతో రైతులకు ఏ మాత్రం మేలు జరగడం లేదు. మండల కేంద్రాల్లోని వేదికలను మాత్రం అప్పుడప్పుడు తెరుస్తూ, క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు వేదికలను పూర్తిగా గాలికొదిలేశారు. ఇదంతా అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదు. ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏఈవోలు ఉండాల్సిందే..

ప్రతీ రైతు వేదికలో ఏఈవోలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉంది. నిర్వహణ వ్యవహారమంతా వీరే చూసుకోవాలి. కానీ, ఏఈవోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నిర్వహణ నిధులు వస్తలేవనే సాకుతో వాటిని పట్టించుకోవడమే మానేశారు. ఆవైపుగా కనీసం కన్నెత్తి చూడటం లేదు. కేవలం మండల కేంద్రాల్లో ఉన్న రైతు వేదికలను మాత్రం అడపాదడపా తెరుస్తూ నామమాత్రపు సేవలందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా రైతులకు సమాచారమేమి అందక సతమతమవుతున్నారు.

అన్నదాతలకు అందని సమాచారం

రైతు వేదికల్లో అన్నదాతలకు అన్ని రకాల సమాచారాన్ని అందించాల్సి ఉండగా అవేమి కానరావడం లేదు. ప్రతీ వారంలో రైతులతో సమావేశం నిర్వహించి శాస్త్రవేత్తల సలహాలు, సాగు పద్ధతులు, మెలుకువలు, పలు పంటలు తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించేందుకు ఏఈవోలు కరువయ్యారు. అలాగే రైతు వేదికల ద్వారానే ప్రతీ యేట రైతులకు ఎరువులు, విత్తనాలు అందించాల్సి ఉండగా అలా అందించిన దాఖలాలు ఎక్కడా లేవు. అయితే రైతులు ఎక్కడ కనబడితే అక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఫొటోలు తిగుతూ కాలం వెల్లదీస్తున్నారనే ఆరోపణలున్నాయి.

45 రైతు వేదికలు.. 45 మంది ఏఈవోలు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 45 రైతు వేదికలు ఉన్నాయి. అలాగే వీటి నిర్వహణకు గాను 45 మంది ఏఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో రెగ్యులర్‌గా 32 మంది ఏఈవోలు ఉండగా, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 13 మందిని నియమించగా వీరంతా పనిచేస్తున్నారు. ప్రధానంగా పంటల సమయంలో రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన వీరు నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి అలాగే 45 రైతు వేదికల్లో కేవలం మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లోనే సేవలు అందుతుండగా మిగిలిన రైతు వేదికల్లో ప్రయోజనం శూన్యంగా మారింది. చాలా రైతు వేదికల చుట్టూ చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు పెరిగాయి. రాత్రి వేళల్లో మద్యం సేవించడంతో పాటు ఇతర అసాంఘీక కార్యకలాపాలు సైతం చోటు చేసుకుంటున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి తమకు సరైన సమయంలో సమాచారం అందేలా చూడాలనే రైతుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

ఇదీ పరిస్థితి..

భూపాలపల్లి జిల్లాలో ఉన్న రైతు వేదికల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. భూపాలపల్లి మండల పరిధిలో 5 రైతు వేదికలు ఉండగా ఇందులో భూపాలపల్లి, జంగేడు రైతు వేదికలు తప్ప మరేవి తెరుచుకోవడం లేదు.

- చిట్యాల మండలంలో 5 రైతు వేదికలు ఉండగా చిట్యాల రైతు వేదికను ఒక్కటే తెరుస్తూ నామమాత్రపు సేవలు అందిస్తున్నారు.
- గణపురం మండలంలో మూడు రైతు వేదికలు ఉండగా మండల కేంద్రంలోని రైతు వేదిక మాత్రమే తెరుస్తున్నారు. మిగిలి రెండు రైతు వేదికలు దుమ్ముధూళితో నిండిపోయాయి.
- కాటారం మండలంలో సైతం 5 రైతు వేదికలు ఉండగా.. ఒక రైతు వేదికలో మాత్రమే సేవలందుతున్నాయి. ఏఈవోలు మిగిలిన రైతు వేదికల గడప కూడా తొక్కడం లేదు.
- మహదేవపూర్‌లో 3 రైతు వేదికలు ఉండగా ఇక్కడ కూడా ఒకే రైతు వేదికను అందుబాటులో ఉంచుతున్నారు.
- మొగుళ్లపల్లిలో 5 రైతు వేదికలు ఉండగా ఏఈవోలు నాలుగు రైతు వేదికలకు చుట్టపు చూపులా వచ్చి వెళుతున్నారనే ఆరోపణలున్నాయి.
- మహాముత్తారంలో 3 రైతు వేదికలుంటే ఒకటే పని చేస్తుండగా మిగిలిన రెండు వేదికల వైపు చూసే వారే లేరు.
- ఇక రేగొండ మండలంలో అత్యధికంగా 7 రైతు వేదికలు ఉండగా మండల కేంద్రంలోని రైతువేదిక నుంచే రైతులకు సమాచారం అందుతుంది. మిగిలిన వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని, రెండు, మూడు రోజులకోమారు ఏఈవోలు అలా వచ్చి ఇలా వెళ్తారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- టేకుమట్ల మండల కేంద్రంలో 4 రైతు వేదికలు ఉండగా.. మండల కేంద్రంలోని రైతు వేదికకే ఏఈవోలు పరిమితం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7: తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అథ్లెట్లు అత్యధిక పతకాలను కొల్లగొట్టి సత్తాచాటారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్నా రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాల బాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది పాల్గొన్న అథ్లెట్ల మధ్య హోరాహోరీగా జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యధిక పతకాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. అండర్-18 బాలుర విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం క్రీడాకారుల పోటీతత్వాన్ని ప్రదర్శించి సత్తాచాటారు. అదే విధంగా మెన్ విభాగంలో కరీంనగర్ ప్రథమ స్థానం, ఉమెన్ విభాగంలో ఖమ్మం జిల్లాలకు చెందిన అథ్లెట్లు రాణించారు.

కాగా, జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు చిరు ప్రాయం నుంచే వారి పిల్లలను మైదానాలకు పంపించి అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్నారులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. చిన్నారులను 8వ యేడు నుంచే క్రీడా మైదానాలకు పంపించి అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించడంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని అనుకున్న గమ్యాన్ని చేరే అవకాశం ఉంటుందన్నారు. చైనా దేశంలో అక్కడి



అండర్-18బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆతిథ్య హనుమకొండ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

చిన్నారులను 8ఏళ్ల ప్రాయం నుంచే క్రీడా మైదానాలకు పంపిస్తారన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లా కేంద్రంలో అథ్లెట్ల కోసం సింథటిక్‌ట్రాక్‌లు నిర్మాణం చేపట్టేలాగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదురుపాక సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ముగింపు రోజు 20కిలోమీటర్ల రేస్‌వాక్, 200, 1500 మీటర్ల పరుగు పందెం, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, 4ఇంటూ100రిలే, మిడ్‌లే రిలే, 10వేల మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15నుంచి17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాజు, జగన్, రజనీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి నీలం సురేష్, రాజుగౌడ్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.



గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, చిత్రంలో సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 7: ఈనెల 9న ఆదివారం జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి పంపించాలని, 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లను మూసివేయాలని, సెకన్ ఆలస్యమైనా అనుమతించకూడదని ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా కనిపించకపోయినట్లయితే 3 కలర్ ఫొటోలు తీసుకుని హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ముందస్తుగా చేరుకుని హాల్ టికెట్ నంబర్లను చెక్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్నులను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్, వైట్ పేపర్స్, పెన్‌డ్రైవ్, టాబ్లెట్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు వేసుకుని రావాలన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరినీ బయటకు పంపించడం జరగదని, అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతోపాటు తీసుకెళ్లేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, అధికారులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూన్ 7: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 76 సెంటర్లలో 35వేల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదని తెలిపారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఆదివారం సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.

పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా


ఎస్ఈలకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలు



హనుమకొండ టౌన్, జూన్7: గ్రూప్- 1 పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి ఉమ్మడి ఐదు జిల్లాల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ సెంటర్‌కు ఏఈ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. ఈ నెలలో జరిగే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌కు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎం కె.కిషన్, డీఈ (టి) కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.









అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

కాజీపేట, జూన్ 7: అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిద్ధిపేటకు చెందిన రంగాచారి (45) నిట్‌లో మెటలర్జీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్నిరోజుల కిందట కుటుంబకలహాలతో భార్య, బిడ్డను తీసుకుని వెళ్లి పుట్టింట్లో ఉంటోంది. గురువారం రాత్రి స్విగ్గీలో డిన్నర్ ఆర్డర్ చేసుకుని భోజనం అనంతరం నిద్రపోయాడు. తెల్లవారేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి తలుపులు పగలకొట్టి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనారోగ్యంతో నిద్రలో మృతి చెందాడా, లేకుంటే ఆత్మహత్యకు పాల్పడ్డడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ పనితీరుపై అసహనం



అంబట్‌పల్లి ఎల్అండ్‌టీ కాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మహదేవపూర్ రూరల్, జూన్ 7: వానాకాలం వరదలు ప్రారంభం కాకముందే పనులు పూర్తిచేసి మేడిగడ్డ బ్యారేజీ గేట్లన్నీ తెరిచి ఉండేలా చూడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ శుక్రవారం లింక్-1లో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. తొలుత సుందిళ్ల బ్యారేజీ ఆతర్వాత అన్నారం బ్యారేజీని పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడిగడ్డ చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి అంబట్‌పల్లిలోని ఎల్అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నభోజనం అనంతరం మీడియాతో మాట్లాడారు. బ్యారేజీలో లోపాల అంశం కేవలం అధికారుల స్థాయిలో మాత్రమే చర్చించారని.. ముఖ్యమంత్రి, మంత్రి స్థాయిలో దీనిపై సమీక్ష జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు బ్యారేజీల వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకే బ్యారేజీలను సందర్శించామని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మధ్యంతర ఉత్తర్వుల్లో సూచించిన విధంగా జరిగే పనుల పురోగతిని పరిశీలించేందుకే వచ్చానని అన్నారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పుతెచ్చి కడితే అందులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో లీకేజీలు అధికమయ్యాయని, మేడిగడ్డ బ్యారేజీ స్ట్రక్చరే కుంగిపోయిందని అన్నారు. దీంతో ప్రాజెక్టు కుంగిపోయి నిరుపయోగంగా మారితే ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు చేసిన అప్పులకు మనమంతా వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బ్యారేజీల పరిస్థితిపై తమ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాయడం వల్లే సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటై బ్యారేజీలను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయని, బ్యారేజీ కుంగిన రోజే నీటిని దిగువకు విడుదల చేస్తే కుంగుబాటు తీవ్రత తగ్గి ఉండేదన్నారు. ప్రస్తుతం బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికి లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల గేట్లను వరదలు పూర్తయ్యే వరకు ఎత్తే ఉంచనున్నట్లు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటైన ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పట్టించుకోకుండా నీటిని నిల్వ చేసి ఎత్తిపోయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు మార్లు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్న ఆయన తన పరిశీలనలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరుగుతున్న పనులు సంతృప్తి ఇచ్చాయని, సుందిళ్లలో పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ అధికారులను హెచ్చరించామని తెలిపిన మంత్రి.. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యారేజీలను పునరుద్ధరించడానికి తాత్కాలిక, శాశ్వత మరమ్మతులపై ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్‌డీఎస్‌ఏ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు మూడు బ్యారేజీల్లో గేట్లన్నీ తెరిచే ఉంచాలని, బ్యారేజీల్లో ప్రధానంగా జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలతో పాటు జీఆర్‌పీ, ఈఆర్‌టీ టెస్టులు చేయాలని సూచించినట్లు తెలిపారు. వీటితో పాటు బ్యారేజీల ఎగువ, దిగువ ప్రవాహాల ముందున్న సీకెంట్ ఫైల్స్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా, ఉంటే ఏంటనేది గుర్తించాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే సీజన్‌లో నీటిని ఎత్తిపోసేందుకు ఎన్‌డీఎస్‌ఏ అనుమతితో జియో ట్యూబ్స్ ఏర్పాటు చేసి పంపింగ్ చేస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటిస్తే అన్నారంలో 11మీటర్లు, సుందిళ్లలో 9మీటర్ల వరకు నీటిని నిల్వ చేస్తూ ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేసుకోవచ్చని అన్నారు.ఎల్అండ్‌టీ నిర్మాణ సంస్థ ప్రతినిధి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. జీపీఆర్ టెస్టు ఆధారంగా ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయని సీసీ బ్లాక్, షీట్‌ఫైల్స్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రి ఉత్తమ్ జ్యుడీషియల్ కమిషన్ విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో విజిలెన్స్ విచారణ ఆధారంగా అప్పటి ఈఎన్‌సీని సర్వీస్ నుంచి తొలగించామని, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్‌రావును ఎక్స్‌టెన్షన్‌ను టర్మినేట్ చేశామని అన్నారు. అన్నారం, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో పంపులన్నీ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ఏ నిర్ణయం తీసుకుంటారని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. తప్పకుండా ఆ ప్రాజెక్టును నిర్మిస్తామని అన్నారు. తమ మేనిఫెస్టోలోను ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించలేదన్నారు. ఐదేండ్లలో 65టీఎంసీల నీటిని ఎత్తిపోసిన ఈ ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు ఎలా స్థిరీకరించబడిందో తెలపాలన్నారు. పాలమూరు రంగారెడ్డికి రూ.23,500కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు లేదని, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,500 కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు రాలేదని తెలిపారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా 16లక్షల ఎకరాలకు సాగునీరందిస్తే సంవత్సరానికి వచ్చే ఎలక్ట్రిసిటీ బిల్లు రూ.వెయ్యి కోట్లయితే కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌లు నడిస్తే సంవత్సరానికి రూ.10వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. ఎల్అండ్‌టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ అనంతరం మంత్రి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ దిగువన, ఎగువన జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక పనులను పరిశీలించారు. అనంతరం బ్యారేజీ నుంచి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని తిరిగి హైదరబాద్‌కు వెళ్ళిపోయారు. ఆయన వెంట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రాజ్‌ఠాకూర్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావులతో పాటు ఎంపీపీ బన్సోడ రాణిభాయి, జడ్పీటీసీ గుడాల అరుణ తదితరులున్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద పగుళ్లు తేలిన పిల్లర్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

అన్నారం బ్యారేజీ పనుల్లో వేగం పెంచండి

మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీకి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బ్యారేజీ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. బ్యారేజీలో పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్ళిన మంత్రి పనుల్లో వేగం పెంచి వానాకాలం లోపు పనులు పూర్తిచేసి గేట్లన్నీ తెరిచి ఉంచాలని అన్నారు. పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి బయలుదేరి వెళ్లిపోయారు.

పనుల్లో వేగం పెంచండి

అన్నారం బ్యారేజి సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

మహదేవపూర్, జూన్ 7: అన్నారం బ్యారేజీ మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధికారులకు సూచించారు. మహదేవపూర్ మండలంలోని అన్నారం సరస్వతి బ్యారేజీని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి వివరాలు సేకరించగా, శుక్రవారం అన్నారం బ్యారేజీని సందర్శించి 35, 48 పిల్లర్ల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్న ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2019, 2020లో లీకేజీల సమస్య, సీసీ బ్లాకులు కొట్టుకపోవడం లాంటి సమస్యలు ఏర్పడినప్పుడు చేసిన మరమ్మతు పనులను పీసీ ఘోష్ అడిగి తెలుసుకున్నారు. ఎంతో అనుభవం కలిగిన సంస్థ



బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

నిర్మాణం సందర్భంగా ఇలాంటి సమస్యలను ముందుగా ఎందుకు అంచనా వేయలేదని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వర్షాకాలం ఆరంభమైన దృష్ట్యా వరదలు వచ్చేలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బ్యారేజీ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదిగిరి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కాజీపేట తిరుమలయ్య

రేపటి నుంచి పోతన విజ్ఞాన పీఠంలో నాటకోత్సవాలు

వడ్డెపల్లి, జూన్ 7: వరంగల్ జెమినీ థియేటర్ ప్రాంతంలోని పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 9, 10, 11 తేదీలలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల తెలుగు ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావులు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9న రాత్రి 7.30 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు రాత, ప్రక్షాళన, 10న అనూహ్యం, వీలునామా, 11న నిశబ్దమా.. నీ ఖరీదెంత?, ఉన్నది ఒకటే జీవితం అనే నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రేక్షకులు, కళాకారులు, కళాభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొని ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జీవీ బాబు, వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, శర్మ, సాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్దీవుల అతిథులకు విస్తృత ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులతో బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్



వరంగల్ కార్పొరేషన్, జూన్ 7: ఈ నెల 17 నుంచి 19 వరకు మాల్దీవుల నుంచి వరంగల్ నగరంలో పర్యటించనున్న అతిథులకు కావలసిన విస్తృత ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ నగర పాలక సంస్థ అవలంబిస్తున్న పారిశుధ్య విధానంపై అధ్యయనం, ఇక్కడి పద్ధతులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, మాడల్ వైకుంఠధామం సందర్శన, ఎఫ్ఎస్‌టీపీ, ఎస్‌టీపీ కేంద్రాల పర్యటన, బయోమైనింగ్ విధానాన్ని అతిథులు వస్తున్నారని అన్నారు. మూడు రోజుల పాటు ఇక్కడి అధికారులు, సిబ్బందికి వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్ఓ రమేష్, ఈఈ సంజయ్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-2024కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు ఇంటర్‌లో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. జూలై 10న నిర్వహించే డీసెట్‌కు ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. దరఖాస్తు కోసం http://-deecet.cdse.telangana.gov.in వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు వేళాయే..

● షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వం ● నేటి నుంచే ప్రక్రియ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెనువెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నుంచే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. వరంగల్, హనుమకొండ జిల్లాలో వెయ్యి మంది ఉపాధ్యాయులకు వివిధ కేటగిరీల్లో పదోన్నతులు సాధించనున్నారు. మల్టీజోన్ -1లో ఈ ప్రక్రియ జూన్ 8 నుంచి ప్రారంభమై జూన్ 22తో ముగియనున్నది. మొత్తంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మల్టీజోన్ - 1లో 15 రోజుల్లో, మల్టీజోన్ -2లో 23 రోజుల్లో పూర్తి చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్‌ను ఖరారు చేసి విడుదల చేసింది.

షెడ్యూల్ ఇలా..

జూన్ 8, 9 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్‌ల తాత్కాలిక పదోన్నతుల జాబితాను ప్రకటించాలి. ప్రస్తుత ఖాళీలతోపాటు స్కూల్ అసిస్టెంట్ల తర్వాత ఏర్పడిన ఖాళీల తాత్కాలిక జాబితాను ప్రకటించాలి. ఎస్జీటీల బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను ప్రదర్శించాలి. ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను డీఈవోలు స్వీకరించాలి. 10, 11 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను స్వీకరించాలి. అభ్యంతరాలు, ఫిర్యాదులను డీఈవోలు పరిష్కరించాల్సి ఉంటుంది. 12వ తేదీన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్ల పదోన్నతులు తుది జాబితాను రూపొందించి ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరచాలి. 13 నుంచి 16 వరకు స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్‌కు అర్హత పొందిన ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలి. పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్‌ల ఉపాధ్యాయులకు పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తారు. 17న ఎస్జీటీల బదిలీల కోసం ఖాళీల జాబితాలను ప్రదర్శించాలి. జాబితాల్లోని అభ్యంతరాలను పరిష్కరించాలి. 18 నుంచి 20 వరకు తుది జాబితాను ప్రదర్శించాలి. వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేయాలి. 21, 22 తేదీల్లో బదిలీల ఉత్తర్వులును సంబంధిత ఉపాధ్యాయులకు అందజేయాలి.

నేడు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ల రిలీవ్

గత ఏడాది నిర్వహించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అక్టోబర్ మాసంలో బదిలీలు పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం వారు బదిలీ అయిన స్థానాల్లోకి వెళ్లాల్సిందిగా విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇలా..

ప్రభుత్వం ప్రకటించిన పదోన్నతుల ప్రక్రియలో హనుమకొండ జిల్లాలో వివిధ కేటగిరీల్లో సుమారుగా 500 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించనున్నారు. 240 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు సాధిస్తుండగా, మరో 260 మంది భాషా పండితులు, పీఈటీలు అప్‌గ్రెడేషన్ పొందనున్నారు. ఇక వరంగల్ జిల్లాలో సుమారు 300 మంది స్కూల్ అసిస్టెంట్లు తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు పొందుతుండగా, 200 మంది భాషోపాధ్యాయులు, పీఈటీలు అప్‌గ్రేడ్ కానున్నారు.

హనుమకొండ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్ఏ గణితం	2	1	12	8
ఎస్ఏ ఫిజిక్స్(తె)	1	1	5	4
ఎస్ఏ బయో(తె)	2	1	0	0
ఎస్ఏ సోషల్(తె)	8	6	39	27
ఎస్ఏ సోషల్(ఉ)	2	1	0	0
ఎస్ఏ తెలుగు	6	4	19	9
ఎస్ఏ హిందీ	5	4	7	5
ఎస్ఏ ఇంగ్లీష్	4	3	18	13
ఎస్ఏ ఉర్దూ	1	1	0	0
ఎస్ఏ(పీడీ)(తె)	1	1	6	4
పీఎస్‌హెచ్ఎం	4	4	43	43

వరంగల్ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్ఏ గణితం	5	4	13	9
ఎస్ఏ ఫిజిక్స్	2	1	6	4
ఎస్ఏ బయో	11	8	28	20
ఎస్ఏ ఇంగ్లీష్	3	2	19	13
ఎస్ఏ సోషల్	11	8	49	34
ఎస్ఏ తెలుగు	7	5	12	8
ఎస్ఏ హిందీ	8	6	5	4
ఎస్ఏ ఉర్దూ	3	2	0	0
ఎస్ఏ పీడీ	0	0	6	4
పీఎస్‌హెచ్ఎం	6	6	54	54

విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 7 : విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న 62 మంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రాలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

వాజేడు, జూన్ 7: పక్క రాష్ట్రాలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని చెరుకూరు, ధర్మవరం, చండుపట్ల, పేరూరులోని ఎరువుల షాపుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువులకు సంబంధించి రికార్డులు, స్టాకు నిల్వలను పరిశీలించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఎరువులను పక్క రాష్ట్రాలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు వాజేడు, ఏటూరునాగారం ఏవోలు గుంటక నరసింహరావు, వేణుగోపాల్, ఏఈవోలు రాజు, హరీష్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ డీలర్లకు సర్టిఫికెట్ల అందజేత

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 7 : జిల్లాలో శిక్షణ పొందిన పలువురు ఫర్టిలైజర్స్ డీలర్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా సర్టిఫికెట్లను అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సుపూర్తి చేసిన 40 మంది డీలర్లకు సర్టిఫికెట్లను అందజే శారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన డీలర్లకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టంపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. రైతుల పెట్టుబడి తగ్గించేందుకు డీలర్లకు శిక్షణ ఇస్తారన్నారు. పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు నేర్పించడంతో పాటు చీడపీడలపై అవగాహన కల్పిస్తారు. దీంతో డీలర్లు రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన జడ్పీ చైర్‌పర్సన్


జడ్పీ చైర్‌పర్సన్‌తో వైద్యులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 7 : ప్రభుత్వ ఆస్పత్రిలో జడ్పీ చైర్పన్ జక్కు శ్రీహర్షిణి ప్రసవించారు. గురువారం రాత్రి భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జక్కు శ్రీహర్షిణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. గతంలో ఇదే ఆస్పత్రిలో మొదటి కాన్పును జడ్పీ చైర్‌పర్సన్ చేయించుకున్న విషయం తెలిసిందే. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించేలా ఆస్పత్రిలో ప్రసవం అయిన జడ్పీ చైర్‌పర్సన్‌ను పలువురు అభినందించారు.

ఏరియా వర్క్‌షాపులో చోరీ?

కాకతీయఖని, జూన్ 7: సింగరేణి భూపాలపల్లి ఏరియా వర్క్‌షాపులో చోరీ జరిగిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ నెల 2వ తేదీన రెండవ షిఫ్టు, రాత్రి షిఫ్టులో దొంగలు సెక్యూరిటీ కళ్లుగప్పి విలువైన కాపర్‌వైరు, 45 కిలోల బ్రాస్ మెటల్‌ను చోరీ చేశారని తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు ఇలావున్నాయి. భూపాలపల్లి పట్టణం నడిబొడ్డున సింగరేణి ఏరియా వర్క్‌షాపు ఉంటుంది. కూతవేటు దూరంలో సెక్యూరిటీ కార్యాలయం, జీఎం కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్ ఉంది. అయితే ఒకవైపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు జరుగగా, మరోవైపు గుర్తు తెలియని దుండగులు తమ పనిని యథేచ్ఛగా చేసుకున్నారు. వర్క్‌షాపులోని లక్షలాది రూపాయల విలువైన సామాగ్రిని దొంగిలించారు. సెక్యూరిటీ కళ్లుగప్పి లోపలికి వెళ్లిన సదరు దుండగులు ఎలక్ట్రీషియన్ స్టోర్‌రూం తాళం పగులగొట్టి విలువైన సుమారు 50 కిలోల ఇత్తడి సామాగ్రిని దొంగిలించడమే కాకుండా ఆరూం ముందు ఉన్న సుమారు 50 మీటర్ల కాపర్ వైరును కూడా ఎత్తుకెళ్లారు. ఇదిలావుంటే.. బయట సెక్యూరిటీ, పలువురు సిబ్బంది ఉండగా విలువైన సామాగ్రిని ఎలా దొంగిలించారని తీవ్ర చర్చ జరుగుతోంది. అలాగే సింగరేణిని కాపాడే సెక్యూరిటీ అధికారి కార్యాలయం ఆవరణలో రికవరీ చేసి నిల్వ ఉంచిన సుమారు 5మీటర్ల కాపర్ వైరు గతంలో దొంగలు ఎత్తుకుపోతే ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలొస్తున్నారు. గడిచిన రెండు, మూడు నెలల్లోనే కేటీకే 6వ గని, కేటీకే 1వ గని, ఏరియా వర్క్‌షాపు, ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో వరుస దొంగతనాలు జరుగడం పట్ల తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్అండ్‌పీసీ అధికారులు నిద్రమత్తు వీడి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బడి బస్సు భద్రంగా..

- వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ దృష్టి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- జిల్లాలో 60 స్కూల్ బస్సులు



ములుగులోని ఓ స్కూల్ బస్సు, బస్సు ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తున్న జిల్లా రవాణాధికారి సిరాజ్ రెహమాన్

ములుగు కలెక్టరేట్, జూన్ 7 : పసుపు పచ్చని బస్సు.. నిన్నటిదాకా బడికి పోనని మారాం చేసిన పిల్లవాడు దాని హారన్ వినపడగానే ఎగిరి గంతేసి భుజానికి పుస్తకాల బ్యాగుతో పరుగున వస్తాడు.. ఆ బస్సులో బడిదాకా ప్రయాణం వారి దృష్టిలో అడ్వెంచర్ రైడింగ్.. భావిభారత ఆశాకిరణాలను మోసుకెళ్లే ఆ బస్సులు భద్రమేనా..? ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన తమ పిల్లలు సాయంత్రం క్షేమంగా ఇల్లు చేరుతారా..? ఈ విధమైన సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్న తరుణంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ దృష్టి సారించి తనిఖీలను చేస్తోంది.

జిల్లాలో 60 స్కూల్ బస్సులు

ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాల వద్ద మొత్తం 60 బస్సులు ఉన్నాయి. విద్యార్థులను ఉదయం ఇంటి నుంచి తీసుకువచ్చి సాయంత్రం మళ్లీ గమ్యస్థానాలకు చేర్చుతాయి. గడిచిన పదేళ్లుగా జిల్లాలో స్కూళ్లు, కాలేజీలకు బస్సుల వినియోగంపెరిగింది. అంతకుముందు విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలలో వచ్చేవారు. కానీ, ట్రెండుకు తగ్గట్టు, అడ్మిషన్ల వేటలో యాజమాన్యాలు సొంతంగా బస్సులను సమకూర్చుకున్నాయి. దీంతో ఒక్కో విద్యాసంస్థకు రెండు మూడు బస్సులు ఉన్నాయిప్పుడు.

రవాణా శాఖ తనిఖీలు ముమ్మరం

ఈనెల 12నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా రవాణా శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. అన్ని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు సమాచారం అందించారు. గతంలో తీసుకున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు మే 15వ తేదీతో ముగిసింది. ఈసారి పరీక్షల అనంతరం రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. దీంతో ఆయా సంస్థల యజమానులు తమ బస్సులను ములుగులోని ఆర్టీఏ కార్యాలయానికి తీసుకువచ్చి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుంటున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలివే..

మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్ పన్ను చెల్లింపు అప్‌డేట్‌గా ఉండాలి. ఫిట్‌నెస్‌ను అనుసరిస్తూ ఇంజన్ సామర్థ్యం, పొల్యూషన్, క్లచ్, గేర్‌బాక్స్, బ్రేక్‌లను సరిచేసుకోవాలి. లైసెన్స్ కలిగి 60ఏళ్ల లోపు వయసు కలిగిన వ్యక్తిని మాత్రమే డ్రైవర్‌గా నియమించుకోవాలి. కనీసం ఐదేండ్ల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండాలి. మూడునెలల కోసారి ఆరోగ్య పరీక్షలు ముఖ్యంగా కంటి పరీక్షలు చేయించాలి. హెల్త్‌కార్డు ఇప్పించాలి. బస్సు అద్దాలకు గ్రిల్స్ అమర్చడంతోపాటు చిన్నారులకు సౌకర్యంగా మెట్లను ఏర్పాటు చేయాలి. డ్రైవర్ వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఇవ్వాలి. సురక్షిత ప్రయాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలి.

కఠిన చర్యలు తీసుకుంటాం
సిరాజ్ ఉర్ రెహమాన్, జిల్లా రవాణాధికారి

మోటారు వెహికిల్ చట్టం జీవో-35 ప్రకారం వాహనాల కండిషన్‌ను యజమానులు పాటించాలి. క్రమం తప్పకుండా వాటి సామర్థ్యాన్ని పరీక్షించాలి. సురక్షిత ప్రయాణం కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ బస్సులో విద్యార్థులకు అటెండెన్స్ తీసుకోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రమాదకర పరిస్థితిలో బస్సులను రోడ్డుపై తిప్పితే సహించేదిలేదు. జూన్ 15లోగా స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దు.

పదోన్నతులు ఆలస్యం కాకుండా చూడాలి

కాకతీయఖని, జూన్ 7 : సింగరేణిలో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులకు విధుల్లో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా, పదోన్నతుల్లో ఆలస్యం కాకుండా చూడాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఏరియాలో సింగరేణి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల రిజర్వేషన్లపై, ఉద్యోగుల సమస్యలు, వారికి అందించాల్సిన బెనిఫిట్స్‌ను త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారిని కాపాడాలని కోరారు. సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్, అధికారులు కవీంద్ర, తుకారామ్, రమేష్, కర్ల, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

క్వార్టర్ ఆక్రమణపై విచారణ

కాకతీయఖని, జూన్ 7 : సింగరేణి క్వార్టర్ ఆక్రమణపై విజిలెన్స్, సింగరేణి ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'అధికారుల కళ్లుగప్పి క్వార్టర్ ఆక్రమణ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై సింగరేణి ఉన్నతాధికారులు, విజిలెన్స్ విచారణ చేపట్టారు. ఆక్రమణకు పాల్పడిన సదరు వ్యక్తిపై చర్యలకు పూనుకున్నట్లు సమాచారం. క్వార్టర్‌ను వెంటనే ఖాళీ చేయించి తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, గత సంవత్సరం ఆగస్టులో ఓ ఎస్అండ్‌పీసీ మూడు నెలల పాటు ఆ క్వార్టర్‌ను జీఎం అనుమతితో అధికారికంగా తీసుకున్నట్లు సమాచారం. అయితే ఆయన దగ్గరి నుంచి పీనల్ రెంట్ వసూలు చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, సదరు వ్యక్తి ఇప్పటికే రిటైర్డ్ కావడం విశేషం. ఇదిలావుండగా ఇన్ని రోజులు ఎవరికీ తెలియకుండా ఆ క్వార్టర్‌లో ఓ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు దర్జాగా ఉండడం పట్ల పలు విమర్శలకు తావిస్తోంది. సెక్యూరిటీలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగే ఈ తతంగానికి పూనుకున్నట్లు తెలుస్తోంది. అయితే క్వార్టర్ ఆక్రమణ చేసిన సదరు సెక్యూరిటీ ఉద్యోగిపై, ఇన్ని రోజులు పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్రమ నిర్మాణాలపై డీపీవో ఆగ్రహం

- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న జీపీ కార్యదర్శి

మొగుళ్లపల్లి, జూన్ 7 : మండల కేంద్రంలో అక్రమంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై జిల్లా పంచాయతీ అధికారి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొగుళ్లపల్లిలోని భూపాలపల్లి రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు పంచాయతీ కార్యదర్శి నరేష్ వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తుడు ఇటీవల కలెక్టర్, డీపీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం రాత్రి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న యజమానితోపాటు ఫిర్యాదు చేసిన వ్యక్తితో విచారణ చేపట్టారు. కాగా, విచారణలో అనుమతి లేకుండా చేపడుతున్న ఇంటికి ఎలాంటి పత్రాలు లేవని తేలడంతో డీపీవో పంచాయతీ కార్యదర్శిని మందలించారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్న ఇళ్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. లేనిపక్షంలో పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ముందుగా ఇంటి నిర్మాణం చేపడుతున్న యజమానులు గ్రామపంచాయతీ నుంచి అనుమతి పత్రాలు తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టాలని డీపీవో సూచించారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

మంగపేట, జూన్ 7 : మండలంలో ఇసుక క్వారీలు అధికంగా ఉండడం వలన రాత్రి, పగలు తేడా లేకుండా లారీలు తిరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని ఉన్నతాధికారులు నియంత్రించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్రంకాని వీరన్‌కుమార్ అన్నారు. మల్లూరులో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరుగగా, ముఖ్య అతిథిగా వీరన్‌కుమార్ హాజరై మాట్లాడారు. బూర్గంపహడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఇసుక లారీల వల్ల ప్రమాదంలో చాలా మూగజీవాలు మృతి చెందుతున్నాయని, వాటిని పంచాయతీ కార్యదర్శిలు తొలగించక పోవడం వలన దుర్వాసనతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్త చర్యలను పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను కొందరు వ్యాపారులు విక్రయించి రైతులను మోసం చేసే అవకాశాలు ఉన్నాయని, రైతులు లైసెన్స్ గల డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో యువమోర్చా మండల అధ్యక్షుడు గుండు రాజేష్, మండల కార్యదర్శి బొల్లికొండ సాంబయ్య, కిసాన్ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మద్దినేని క్రిష్ణమూర్తి, వీర్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపల్లి బొగ్గులవాగు శివారులో చిరుత సంచారం

మల్హర్, జూన్ 7: మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గులవాగు సమీపంలో గోపయ్యకుంట వాగులో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. శుక్రవారం ఉదయం చేపల వేటకు వెళ్లిన కొందరు వ్యక్తులకు చిరుత పాదముద్రలు కనిపించడంతో వారు మీడియాతో పాటు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది చిరుత సంచరించినట్లుగా ఉన్న ప్రాంతంలో అడుగులను పరిశీలించారు. గత వారం పెద్దపల్లి జిల్లాలో చిరుత సంచరించగా అదే చిరుత ఇటువైపు రావచ్చునని అనుమానిస్తున్నారు. గత రాత్రి బొగ్గులవాగు సమీపంలో వర్షం కురవడంతో పాదముద్రల ఆనవాళ్లు స్పష్టంగా కనపడటం లేదని అన్నారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం ఉంటే అటవీఅధికారులకు తెలియజేయాలని కొయ్యూరు రేంజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కాగా, అటవీ సిబ్బంది అవి చిరుత పులి ఆనవాళ్లు కాదని, తోడేలువిగా నిర్ధారించారు.

క్రీడాకారులను అభినందించిన జిల్లా క్రీడల అధికారి

ములుగు కలెక్టరేట్, జూన్ 7: తెలంగాణ అథ్లెటి క్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడి యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి తుల రవి అభినందించారు. శుక్ర వారం ములుగులో జరిగి న కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ములుగుజిల్లాలోని ఏటూ రునాగారానికి చెందిన సంజన(గోల్డ్, సిల్వర్ మెడల్స్), వైష్ణవిదేవి(సిల్వర్ మెడల్), హరిప్రి య(బ్రాంచ్ మెడల్, అప్రోచ్ సిల్వర్ మెడల్), మనీష్, రాధిక, నిక్షిత(బ్రాంచ్ మెడల్) సాధించా రని తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారు లకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఉద్యోగాలతో పాటు ఎంబీబీఎస్, అగ్రికల్చర్ బీటెక్, వివిధ కళా శాలల్లో సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గెలుపొంది ములుగు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెం ట్ లావణ్యకుమారి, కోచ్ పర్వతాల కుమారస్వా మి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో జూనియర్ అసిస్టెంట్ మృతి

- శరీరంపై గాయాలు.. సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు
- అదుపులోకి ఇద్దరు అనుమానితులు?
- జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో విషాదం



ఇంట్లోని బాత్‌రూమ్‌లో మృతి చెందిన పంగ రమేష్, ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముంటూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన పంగ రమేష్(50) అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గతంలో వీఆర్ఏ, వీఆర్‌వోగా పనిచేసిన ఆయన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం భూపాలపల్లి మునిసిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందటే కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా రమేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండటం, కోతులు ఇంట్లోకి చొరబడి చిందరవందర చేశాయి. దీంతో గమనించిన ఇంటి పక్కనున్న వారు కోతులను కొట్టేందుకు ఇంట్లో వెళ్లి చూడగా రమేష్ విగత జీవిగా బాత్‌రూమ్‌లో పడి ఉన్నాడు. ఆ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. కాగా, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయి.

అదుపులోకి ఇద్దరు వ్యక్తులు..?

ఈ ఘటన వివరాలు తెలియగానే సకాలంలో చేరుకున్న పోలీసులు రమేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణను వేగవంతం చేసి మృతుడి ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి అందులోని హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్లోని ఓ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ అవసరాలకు పంగ రమేష్ వారి బంధువుల వద్ద తీసుకున్న డబ్బుల విషయంలోనే గొడవలు జరిగి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే చర్చ జరుగుతోంది. కాగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

విచారణ తదుపరి వివరాలు వెల్లడిస్తాం..
మల్లేష్‌యాదవ్, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐ

భూపాలపల్లి రాంనగర్‌లో జరిగిన ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన పిదప వివరాలు వెల్లడిస్తాం. శరీరంపై గాయాలు ఉండటం మూలంగా హత్య చేసినట్లుగానే అనుమానిస్తున్నాం. త్వరలోనే నిజాలు తేల్చి హత్యా.. ఆత్మహత్యా.. సాధారణ మరణమనేది చెబుతాం.

మహిళ అదృశ్యం


ప్రియాంక (ఫైల్)

గోవిందరావుపేట, జూన్ 7: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎట్టి ప్రియాంక అనే మహిళ అదృశ్యమైనట్లు పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీపురం గ్రామంలోని ఎట్టి సారయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, చిన్న కుమార్తె ప్రియాంకకు పదేళ్లుగా మతిస్థిమితం సరిగా ఉండడంలేదు. ఈక్రమంలో ఈనెల 6న సారయ్య పనిమీద పస్రాకు వెళ్లగా ప్రియాంక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఇంటికి చేరుకున్న సారయ్య బంధువుల ఇళ్లలో వెతికినా ప్రియాంక ఆచూకీ తెలియలేదు. బాధితురాలి సోదరి పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, ప్రియాంక ఆచూకీ తెలిసిన వారు 8712670086 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

పెసా సభల ద్వారానే గ్రామాల అభివృద్ధి

వెంకటాపురం(నూగూరు), జూన్ 7: పెసా గ్రామసభల ద్వారానే ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పెసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పెసా చట్టం నిబంధనలను అనుసరించి గ్రామసభలు నిర్వహించాలని, గ్రామంలోని కులపెద్దలు, డ్వాక్రా మహిళా ప్రతినిధులు, యువతీ, యువకులు సమన్వయంతో పెసా గ్రామసభలను బలోపేతం చేయాలన్నారు. మండలంలో గిరిజన మత్స్యసంఘాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు, పెసా జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, మండల అధ్యక్షుడు ఇరుప రాజు, సభ్యులు ప్రసాద్, నరేష్, తాటి సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం ప్రాజెక్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 7 : మండలంలోని పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వ పనులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి మండల పరిధిలోని ఆరుగుంటపల్లి వద్ద పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ ఆరుగుంటపల్లి సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడం వల్ల చిరుతపల్లి, బర్లగూడెం, రామవరం తదితర గ్రామాల రైతుల పంట పొలాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు. ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో రబీ పంటకు నీరు అందక రైతులు నష్టపోయారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పాలెం ప్రాజెక్టు కాల్వకు మరమ్మతులు చేయడంతోపాటు పనులను నాణ్యతగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ చిహ్నంలో మార్పు చేయాలి

కాటారం, జూన్ 7: ప్రభుత్వం తలపెట్టిన రాష్ట్ర చిహ్నం మార్పు ప్రతిపాదనను ధర్మ సమాజ్ పార్టీ ఆహ్వానిస్తుందని, డీఎస్పీ రూపొందించిన రాష్ట్ర చిహ్నాన్ని ఆమోదించాలని ఆ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిట్యాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ నేతలు చిట్యాల శ్రీనివాస్, చిత్ర శ్రీకాంత్, సుశాంత్ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన తెలంగాణ రాష్ట్ర చిహ్నం 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల వారసత్వ ప్రేరణను కొనసాగించడానికి ప్రతీకగా ఉంటుందని, ప్రభుత్వం దీనిని ఆమోదించేలా చూడాలని ఆ వినతిలో కోరారు.

కరకట్టలు నిర్మించి ముంపు నుంచి రక్షించండి

- మంత్రి ఉత్తమ్‌కు రైతుల వేడుకోలు

భూపాలపల్లి/మహదేవపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అన్నారం సరస్వతి బ్యారేజీ నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్‌తో తమ భూములు నీట మునిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బ్యారేజీకి ఇరువైపులా కరకట్టలు నిర్మించి ముంపు నుంచి కాపాడాలంటూ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల రైతులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల సందర్శనలో భాగంగా శుక్రవారం అన్నారం బ్యారేజీని సందర్శించేందుకు వచ్చిన మంత్రిని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సుందరశాల గ్రామానికి చెందిన రైతులతో పాటు అన్నారం గ్రామానికి చెందిన రైతులు తమ ముంపు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందిస్తూ ఇందుకు సంబంధించి ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు తన దృష్టికి తెచ్చారని, ముంపు వల్ల రైతులకు నష్టం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే మరోసారి మంత్రితో సమావేశమై దీనిపై విస్తృతంగా చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ప్రాజెక్టు అధికారులను ముంపు భూముల వివరాలను వెంటనే తనకు పంపాలని ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టులో లీకేజీలు ఏర్పడిన 28, 35, 48 పిల్లర్లను పరిశీలించి సీసీ బ్లాక్‌ల ఏర్పాటు, గ్రౌటింగ్ పనులను పర్యవేక్షించారు. మొత్తం పనులు పది రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

(5వ పేజీ తరువాయి)

స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ ఎలిమినేషన్‌లో ఆయనకు వచ్చిన ఓట్లతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కూడా ప్రధాన అభ్యర్థుల్లో ఎవరికీ ఏకపక్షంగా రాలేదు. ఈయన ఎలిమినేషన్ తర్వాత బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆయనకు వచ్చిన 43,313 బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యతలోనూ ఎవరికీ ఏకపక్షంగా ఓట్లు పడలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి బీజేపీ కేడర్‌తో సన్నిహిత సంబంధాలుండడం, ఆయన ఇటీవలి వరకు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసి ఉన్న నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటేసిన వారిలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేస్తారని భావించినా వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు గణనీయమైన ఓట్లు రావడంతో ఆయనే మంచి మెజార్టీతో ఆధిక్యతలో ఉన్నారు. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల అనుమతితో సాంకేతిక వెసులుబాటు ద్వారా మల్లన్నను విజేతగా ప్రకటించే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన చేపట్టారు.

2021 మాదిరిగానే చివరి వరకు ఉత్కంఠ

2021లో జరిగిన ఎన్నికలోనూ దాదాపు ఇదేరీతిలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాటి స్వతంత్ర అభ్యర్థి తీన్మార్‌మల్లన్న, తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అభ్యర్థి రాములు నాయక్, సీపీఐ అభ్యర్థి జయసారథిరెడ్డి, యువ తెలంగాణపార్టీ నుంచి రాణిరుద్రమరెడ్డి తదితరులు పోటీచేశారు. వారిలో ప్రేమేందర్‌రెడ్డి నాలుగో స్థానంలో ఉండగా, ఆయన ఎలిమినేషన్ తర్వాత కూడా మొదటి, రెండో స్థానాల్లో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తీన్మార్ మల్లన్నల్లో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో మూడో స్థానంలో ఉన్న ప్రొఫెసర్ కోదండరామ్‌ని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. కోటా ఓటుకు పల్లారాజేశ్వర్ రెడ్డి చేరడంతో ఆయన్ను ఎమ్మెల్సీగా ప్రకటించారు. ఆ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మల్లన్నే ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి బరిలో దిగి, తీవ్రపోటీలోనూ సంచలన విజయం నమోదుచేశారని చెప్పవచ్చు.

మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా మల్లన్న విజయం

జర్నలిస్టుగా, ప్రశ్నించేగొంతుకగా.. తీన్మార్ మల్లన్నగా అందరికీ సుపరిచితుడైన చింతపండు నవీన్ ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2015లో ఆయన మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. ఆతర్వాత 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా కొట్లాడిన క్రమంలో మల్లన్నపై 59వరకు కేసులు నమోదయ్యాయని, ప్రశ్నించే గొంతుకగా పోరాడిన మల్లన్న గెలుపు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్‌నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో జరిగిన అన్ని రౌండ్లలోనూ మల్లన్నకు ఓట్ల ఆధిక్యత వచ్చింది. మొత్తం 4,63,839 ఓట్లకు గాను, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. వీటిల్లో 25,824 ఓట్లు చెల్లకుండా పోగా, 3,10,189 ఓట్లు చెల్లాయి. వీటిల్లో కోటా ఓటు 1,55,095 ఓట్లు ఎవరికీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్‌అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 29,967 ఓట్లు వచ్చాయి. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ అశోక్‌కుమార్ సహా స్వతంత్ర అభ్యర్థులందరిఓట్లలో మల్లన్నకే ఎక్కువ ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఓట్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి దీటుగా ఓట్లు రాబట్టారు.